AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

సమాజ హితమే లక్ష్యంగా మండపాలు

2

2

మహిళ పై రేజర్ బ్లేడ్‌తో దాడి

బీఈడీ, బీపీఈడీ ఫలితాలు విడుదల

అక్షరటుడే, తెయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరిగిన బీఈడీ, బీపీఈడీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను క్యాంపస్‌లో వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, కంట్రోలర్ సంపత్ కుమార్ తో కలిసి విడుదల చేశారు. బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షకు 1,334 మంది విద్యార్థులు హాజరుకాగా 1,173 మంది ఉత్తీర్ణత సాధించారని, బీపీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షకు 100 మంది విద్యార్థులు హాజరుకాగా 90 మంది ఉత్తీర్ణత సాధించారని కంట్రోలర్ వివరించారు.

విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: మంత్రి సీతక్క

అక్షరటుడే, కామారెడ్డి: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలో పర్యటించిన ఆమె పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాల పునర్నిర్మాణ పనులకు రూ. 5 కోట్లతో శంకుస్థాపన చేసి, జీవీఎస్ కళాశాల సమీపంలో ఉమెన్స్ హాస్టల్ భవనాన్ని ఆమె ప్రారంభించారు. చదువుకున్న పాఠశాలకు జీవం పోసే అవకాశం ఎంతో అదృష్టం చేస్తేనే దక్కుతుందని, ఆ అదృష్టం షబ్బీర్ అలీకి దక్కిందన్నారు. పాఠశాల భవనాన్ని నాణ్యతతో నిర్మించాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టారని, క్వాలిటీతో కూడిన ఎడ్యుకేషన్ కిట్ కూడా ఇస్తున్నారని తెలిపారు. తన విద్యాభ్యాసం ఈ బాలుర పాఠశాలలోనే సాగిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గుర్తు చేసుకున్నారు. ఈ పాఠశాలతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. పాఠశాల పునర్నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి రూ. 5 కోట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇదే ఆవరణలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి రూ. 10.10 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. పాఠశాలలో మైదానం విశాలంగా ఉందని, ఆ మైదానం అలాగే ఉండేలా నిర్మాణం చేపట్టాలన్నారు. అనంతరం షబ్బీర్ అలీతో పాటు చదువుకున్న స్నేహితులను మంత్రి సీతక్క శాలువాతో సత్కరించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, డీఎఫ్ఓ నీరజ్ కుమార్, అడిషనల్ కలెక్టర్ విక్టర్, డీఈఓ మల్లికార్జున్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గిరిజనులకు అన్యాయం : బాజిరెడ్డి గోవర్ధన్

అక్షరటుడే, బాన్సువాడ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు పూర్తవుతున్నా గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. మంగళవారం బాన్సువాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అదే గిరిజనులను విస్మరించిందని ఆరోపించారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడంతో పాటు వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 17న బాన్సువాడ నియోజకవర్గంలోని ప్రతి తండాలో నిరసన దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బాజిరెడ్డి గోవర్ధన్ ప్రకటించారు. ప్రతి తండాలోని గిరిజన బిడ్డకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసం, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వాస్తవాలను వివరించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనులకు నిజమైన న్యాయం జరిగిందని గోవర్ధన్ పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 57 తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. బాన్సువాడ మండలం పులికుచ్చ తండాకు చెందిన మాజీ సర్పంచ్ పీర్‌సింగ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బాజిరెడ్డి గోవర్ధన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అంజిరెడ్డి, మోరిల్ శ్రీనివాస్ రావు, జుబేర్, ధర్మతేజ, మోచి గణేష్, బోడ చందర్, సాయిబాబా, ఖలీల్, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీ సారంగపూర్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లో బీఈడీ విద్యార్థుల ఫలితాలు, ప్రాక్టికల్ మార్కుల కేటాయింపుపై పలు అనుమానాలు, ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. కొందరు అధ్యాపకుల నిర్ణయాలే అంతిమంగా మారుతున్నాయన్న భావన విద్యార్థుల్లో నెలకొన్నట్లు తెలుస్తోంది.

– అక్షరటుడే, తెయూ క్యాంపస్

బీఈడీ ఫలితాల్లో గందరగోళం..!

- మార్కులు ఎక్కువ వచ్చినా తక్కువ గ్రేడ్ ఇచ్చారంటున్న విద్యార్థులు
- ప్రాక్టికల్ మార్కుల్లో కోతలపై ఆగ్రహం
- 'రెస్పెక్ట్ ఇవ్వడం లేదంటూ' మార్కులు తగ్గించారనే ఆరోపణలు
- భవిష్యత్తుపై భయంతో ప్రశ్నించేందుకు వెనుకడుగు

తెయూ పరిధిలో ఈ ఏడాది జూన్-జులై నెలల్లో బీఈడీ నాలుగో సెమిస్టర్ థియరీ పరీక్షలు జరిగాయి. 85 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో మార్కులు, గ్రేడ్ల మధ్య తేడాలు కనిపించడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల ఆరోపణల ప్రకారం.. ఎక్కువ మార్కులు సాధించిన వారికి తక్కువ గ్రేడ్, తక్కువ మార్కులు వచ్చిన వారికి ఎక్కువ గ్రేడ్ వేశారంటూ విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఫలితాల ప్రక్రియలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మార్కులు ఒకటి.. గ్రేడ్ మరొకటి

బీఈడీ నాలుగో సెమిస్టర్ థియరీ పరీక్షల ఫలితాల అనంతరం కొందరు విద్యార్థులు తమ మార్కులు, గ్రేడ్లను పరిశీలించగా వ్యత్యాసాలు కనిపించాయని చెబుతున్నారు. ఒక విద్యార్థికి ఎక్కువ మార్కులు వచ్చినప్పటికీ తక్కువ గ్రేడ్ రావడం, మరో విద్యార్థికి తక్కువ మార్కులు ఉన్నప్పటికీ ఎక్కువ గ్రేడ్ రావడం ఎలా సాధ్యమైందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇది కేవలం ఒకరిద్దరి సమస్యేనా? లేక ఫలితాల రూపకల్పనలోనే ఏదైనా సాంకేతిక లేదా పరిపాలనా లోపం జరిగిందా? మార్కుల నుంచి గ్రేడ్‌కు మార్చిడి చేసే విధానం ఏమిటి..? ఫలితాల తుది పరిశీలన ఎవరి ఆధ్వర్యంలో జరిగిందనే అంశాలపై స్పష్టత లేకుండా పోయింది. విద్యార్థులు ఈ విషయాన్ని సంబంధిత అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు క్యాంపస్ ప్రిన్సిపల్‌కు కూడా వివరించినట్లు తెలిసింది. అయినప్పటికీ తమకు సరైన సమాధానం లభించలేదని కొందరు విద్యార్థులు వాపోతున్నారు.

ప్రశ్నిస్తే భవిష్యత్తుపై ప్రభావం..

మరో ఆసక్తికరమైన ఆరోపణ కూడా విద్యార్థుల నుంచి వినిపిస్తోంది. సంబంధిత అధ్యాపకుడి కూతురుకు ప్రాజెక్టు పనుల ఖర్చులను సొంతంగా భరించి సహకరించిన ఒక విద్యార్థికి సైతం ప్రాక్టికల్ పరీక్షల్లో తక్కువ మార్కులు కేటాయించారనే ఆరోపణలు క్యాంపస్‌లో కోడై కుస్తోంది. సారంగాపూర్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లో విద్యార్థులు తమ సమస్యలను బహిరంగంగా ప్రశ్నించేందుకు వెనుకాడుతున్నారని తెలుస్తోంది. దీనికి కారణం.. ఇదే క్యాంపస్‌లో కొందరు భవిష్యత్తులో ఎంఈడీ చదవాల్సి ఉండడంతో భవిష్యత్తుపై బెంగతో వారు ముందుకు రావట్లేదని సమాచారం.

'రెస్పెక్ట్ ఇవ్వలేదని' మార్కుల్లో కోత?

క్యాంపస్‌లో పనిచేస్తున్న ఓ కాంట్రాక్ట్ అధ్యాపకుడి వ్యవహారశైలిపై విద్యార్థులు తీవ్రంగా మండి పడుతున్నారు. తనకు తగిన గౌరవం ఇవ్వడం లేదనే కారణంతో ఓ అధ్యాపకుడు.. కొందరు విద్యార్థులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రాక్టికల్ పరీక్షల్లో తక్కువ మార్కులు కేటాయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు వాస్తవమా? కాదా? అన్నది సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి తేల్చాల్సి ఉంది.

మా దృష్టికి రాలేదు..

సారంగపూర్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లో బీఈడీ నాల్గో సెమిస్టర్ ఫలితాల్లో గ్రేడింగ్ వ్యత్యాసం అయినట్లు, అలాగే ప్రాక్టికల్ మార్కుల్లో కోత పెట్టిన అంశం మా దృష్టికి రాలేదు. ఏదైనా తమకు సమాచారం ఇస్తే సమస్య లేకుండా పరిష్కారం చూపేందుకు ప్రయత్నం చేస్తాం. మార్కుల రేషియో అనుసరించి జీపీఏ గ్రేడింగ్ వస్తుంది. గతంలో ఓ బీఈడీ కళాశాలకు సంబంధించి రెండో సెమిస్టర్ ఫలితాల గ్రేండింగ్‌లో సాంకేతిక లోపం జరిగినట్లు మా దృష్టికి రావడంతో సరిదిద్దాం.

– ప్రొఫెసర్ సంపత్ కుమార్, కంట్రోలర్ తెయూ

కలెక్టరేట్‌లో మట్టిగణనాథుడికి భక్తితో పూజలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: వినాయక చవితి సందర్భంగా కలెక్టరేట్‌లో మట్టిగణనాథుడిని ప్రతిష్ఠించారు. మంగళవారం అదనపు కలెక్టర్ భుజంగ రావు ఆధ్వర్యంలో ఉద్యోగులు పూజలు నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజల్లో ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్వో గీత పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఈ పూజలో పాల్గొనగా, వేద బ్రాహ్మణులతో సాంప్రదాయబద్ధంగా పూజాదికాలు జరిపించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. విఘ్నాలు తొలగించే ఆది దేవుడు విఘ్నేశ్వరుని కృపతో అంతటా శాంతి సౌభాగ్యాలు సమకూరాలని అదనపు కలెక్టర్ భుజంగరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో బాలరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కామారెడ్డి బల్దియా అభివృద్ధికి నిధులు ఇవ్వండి

అక్షరటుడే, కామారెడ్డి : కామారెడ్డి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం ఆర్థిక, పరిపాలనా సహాయం అందించాలని కోరుతూ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి పంచాయతీరాజ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కకు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం కామారెడ్డి పర్యటనకు వచ్చిన మంత్రిని ఛైర్‌పర్సన్ కలిసి వినతిపత్రం అందజేశారు.కామారెడ్డి మున్సిపాలిటీ వేగంగా పట్టణీకరణ చెందుతున్న నేపథ్యంలో విద్య, వైద్య, సామాజిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో 97 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, 5 డిగ్రీ కళాశాలలు, ఒక మెడికల్ కళాశాల, ఒక టెక్నికల్ సంస్థ ఉన్నప్పటికీ సాంకేతిక విద్యలో ఇంకా కొరత ఉందని తెలిపారు. ఈ లోటును భర్తీ చేసేందుకు ఇంజినీరింగ్ కళాశాల, లా కళాశాల, నర్సింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, నైపుణ్య అభివృద్ధి, వృత్తి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామన్నారు. అదేవిధంగా పట్టణ ప్రజల శ్రేయస్సు కోసం సామాజిక మౌలిక సదుపాయాల కింద క్లాక్ టవర్, స్వాగత తీరణం, విద్యుత్ ఆదా కోసం సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. మొదటి దశలో విద్యా సంస్థల విస్తరణ, స్థాపన, ఆధునీకరణ, రెండవ దశలో సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపడతామని తెలిపారు.

గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జుక్కల్ నియోజకవర్గ స్థాయి గిరిజన నాయకులతో కలసి మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తీవ్రంగా మోసం చేసిందని ఆయన ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజన తండాలను జీపీలుగా ఏర్పాటు చేసి, గిరిజన ప్రజలకు స్థానిక పాలనతో పాటు అభివృద్ధిని చేశారన్నారు. గిరిజన ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెప్తారన్నారు. గిరిజన నాయకులు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.కృష్ణమోహన్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగు ప్రొఫెసర్ పోస్టులు, ఏడు అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 51 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే 15 ట్యూటర్ ఉద్యోగాలు, ఆరు సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి డీఎంఈ నుంచి ఆదేశాలు అందాయని పేర్కొన్నారు. ఆయా పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడానికి అనుమతి లభించిందన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను ప్రభుత్వ వైద్య కళాశాల పనిదినాల్లో సాయంత్రం 4 గంటల్లోపు నిర్దేశించిన తేదీల్లో అందజేయాల్సి ఉంటుందన్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఈనెల 22వ తేదీన ఉదయం 10.30కు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఖాళీలు, వేతన వివరాల కోసం కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం : మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. సీపీఐ మావోయిస్టు సీనియర్ అండర్ గ్రౌండ్ క్యాడర్ డివిజన్ కమిటీ సభ్యురాలు పోలీసుల ఎదుట లొంగిపోయింది. మావోయిస్టు కమిటీ సభ్యురాలు నక్క సుశీల అలియాస్ రాణి అలియాస్ లత లలిత రేలా జ్యోతి అలియాస్ మాధవి అలియాస్ శ్వేత నిజామాబాద్ పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మంగళవారం మీడియా సమక్షంలో వివరాలు వెల్లడించారు. మావోయిస్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యురాలు, డీవీసీ ఛత్తీస్ ఘడ్ ఏరియా సభ్యురాలైన నక్క సుశీల బోధన్‌లోని శంకర్ నగర్ చెందిన వారు. ఆమె తండ్రి నిజాం షుగర్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవారు. 2005లో ఆయన గుండెపోటుతో మరణించారు. సుశీల చిన్నప్పుడే తల్లి కమల అనారోగ్యంతో మృతి చెందింది. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న సమయంలో ఆమెకు బంధువైన సురేంద్ర ద్వారా దివంగత రామ్మోహన్‌రావు పరిచయమయ్యారు. ఆయన సీపీఐ ఎంఎల్ పీడబ్ల్యూ సిద్ధాంతాలు కలిగి ఉండడంతో సుశీల ఆకర్షితురాలైంది. ఆమె 1990లో నల్గొండ జిల్లా కమిటీ ఏసీఎం అయిన సుంకర

రామ్మోహన్‌రావును వివాహం చేసుకున్నారు. అనంతరం ఫిబ్రవరి 1992లో సీపీఐఎంఎల్ పీడబ్ల్యులో చేరారు. 2001లో నల్లమల అడవిలో జరిగిన ఎదురు కాల్పుల్లో రామ్మోహన్ రావు మరణించారు. ఆ తర్వాత 2004లో ఆమె ఎస్‌సీఎం సామలును వివాహం చేసుకున్నారు. అనంతరం ఛత్తీస్‌గడ్ అటవీప్రాంతంలో 2006లో జరిగిన ఎదురు కాల్పుల్లో ఆయన మరణించారు. మావోయిస్టు కార్యకర్తలు అందరూ జనజీవన స్రవంతిలో చేరాలని ప్రభుత్వం చేసిన సూచన మేరకు సుశీల లొంగిపోయినట్లు సీపీ తెలిపారు.

లక్ష్మీ కాలువకు 250 క్యూసెక్కుల నీరు విడుదల

అక్షరటుడే, ముప్కాల్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మీ కాలువకు మంగళవారం ఉదయం అధికారులు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ఈఈ పవన్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కలిసి లక్ష్మీ కాలువకు నీటిని విడుదల చేశారు. ఆయకట్టు రైతులకు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి విడుదల చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈ డి.లోక్య, ఏఈ వినోద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఈనెల 20న బీసీ కలాల 'అలాయ్ బలాయ్'

అక్షరటుడే, ఎల్లారెడ్డి: తొలి బీసీ కవితా సంకలనం 'వెంటాడే కలాలు వెనుకబడిన కులాలు' సభను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈ లక్ష్మీనారాయణ కరపత్రాలను ఆవిష్కరించారు. చేతివృత్తుల జీవితాల్లో, వృత్తుల్లో తలెత్తుతున్న సమస్యలు, సంక్షోభాలను చిత్రించిన కవితా సంకలనం 'వెంటాడే కలాలు.. వెనుకబడిన కులాలు" 2001లో ప్రచురితమైందని ఆయన అన్నారు. ఈ ఏడాది రజతోత్సవ వేడుకలు జరుపుకుంటుందన్నారు. ఈ సందర్భంగా బీసీ రచయితల సమాఖ్య తరపున 'బీసీ కలాల అలాయ్ బలాయ్' కార్యక్రమం ఈనెల 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందన్నారు. అధ్యాపకులు శంకరయ్య, చంద్రకాంత్, జంగం శివకుమార్, సిద్ధరాజు, కృష్ణ ప్రసాద్, సురేశ్ రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. నగరంలోని సీపీఐ జిల్లాశాఖ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ఈ నెల 17న నాంపల్లి గ్రౌండ్స్‌లో జరిగే సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాలను స్మరిస్తూ ఈనెల 11వ తేదీ నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17న హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బహిరంగ సభకు పెద్దఎత్తున ప్రజలు హాజరుకావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినాన్ని అధికారికంగా జరుపుతున్నప్పటికీ ఈ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరుతున్నామన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వై.ఓమయ్య, సీపీఐ జిల్లా నాయకులు పి.హన్మాండ్లు, ప్రసాద్, గోవర్ధన్, రాధా కుమార్ పాల్గొన్నారు.

వినాయక చవితి వచ్చిందంటే ప్రతి వీధిలో పండగ వాతావరణమే.. ఇంటింటా గణనాథుడి పూజ ఒక సంప్రదాయం అయితే, వీధులు, కాలనీల్లో సామూహికంగా విగ్రహాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు చేయడం మరో ప్రత్యేకత. అసలు ఈ సామూహిక ఉత్సవాల వెనుక ఉన్న చరిత్ర, లక్ష్యం తెలుసుకుందాం.
– అక్షరటుడే, ఎల్లారెడ్డి

సమాజ హితమే లక్ష్యంగా.. గణేష్ మండపాలు

- భక్తితో పాటు సామాజిక చైతన్యం ముఖ్యం
- కూలాతీత ఐక్యతకు వేదికలు గణేష్ మండపాలు
- ఉమ్మడిజిల్లాలో ఉప్పొంగుతున్న భక్తిభావం

విఘ్నాలు తొలగించే దేవుడిగా గణపతిని ఆరాధించడం, ఏ శుభకార్యమైనా ఆయన పూజతో మొదలుపెట్టడం మన సంప్రదాయం. ఇది మొదట్లో ఇళ్లకే పరిమితం. కాలక్రమేణా ప్రజలంతా కలిసి ఒకే చోట విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

తిలక్ ఆలోచనతో..

చరిత్రలో చూస్తే 1893లో మహారాష్ట్రలోని పూణేలో బాల గంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాలను బహిరంగ, సామూహిక వేడుకగా మార్చారు. అప్పటి బ్రిటిష్ పాలనలో ప్రజలు ఒకచోట చేరడంపై నిషేధం ఉండేది. దాన్ని అధిగమించడానికి, ప్రజల్లో స్వాతంత్ర్య చైతన్యం, ఐక్యత పెంచడానికి గణేష్ ఉత్సవాన్ని వేదికగా వాడుకున్నారు. ఆ స్ఫూర్తే దేశమంతా వ్యాపించింది. వినాయక చవితి ఉత్సవాలు.. పండగ మాత్రమే కాదు. జీవితాన్ని తీర్చిదిద్దేందుకు అనుసరించే వేపు బాటలు ఈ వేడుకలో ఇమిడి ఉన్నాయి. గణేష్ మండపాన్ని నిర్మించాలంటే ఎంత ఖర్చు పెట్టాలి..? ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకోవాలి? అని ముందుగా నిర్ణయించి ప్రకారం చందాలు వసూలు చేస్తారు. ఇది డబ్బును అదుపులో వాడటంతో పాటు వ్యాపార పైపుణ్యాలను అలవరుస్తుంది.

నాయకత్వ లక్షణాలు..

ప్రతీ ఒక్కరూ ముందుండి వేడుకను విజయవంతం చేయడానికి కలిసికట్టుగా సాగుతారు. ఒక్కొక్కరు ఒక్కో బాధ్యతను పంచుకుంటూ సమన్వయంతో వ్యవహరిస్తారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా పూర్తిచేస్తారు. ప్రతీ ఒక్కరూ తాము నాయకుడిగా భావిస్తూ మిగిలిన వారికి తోడా సాయంగా, సూచనలు ఇస్తుంటారు.

సహనం.. ఓర్పు

మండపాల్లో ఏమైనా సమస్యలు వస్తే నిర్వాహకులు వెంటనే చర్యలు చేపడుతారు. దీంతో యువత, చిన్నారుల్లో సమస్యల పరిష్కారంపై అనుభవం వస్తుంది. నిద్ర, అలసటను లెక్కచేయకుండా సమయ పాలన పాటిస్తూ ఉత్సవాల్లో పాల్గొంటారు. దీంతో సహనం, ఓర్పు, క్రమశిక్షణ, ఆంతరికభావం అలవడుతాయి. ఎల్లారెడ్డి పోలీస్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో 651 గణేష్ మండపాల నిర్వహణకు ఇప్పటివరకు దరఖాస్తులు వచ్చాయి. ఎల్లారెడ్డి మండలంలో 162 గణేష్ల ఏర్పాటుకు మండపాల నిర్వాహకులు దరఖాస్తులు చేసుకున్నారు. వీటికి సంబంధించి పోలీసుల భద్రత ఏర్పాట్లు చూస్తున్నారు.

నిమజ్జనం.. కేవలం ఆచారం కాదు

మట్టి విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేయడం వెనుక జీవిత సత్యం ఉంది. పుట్టిన ప్రతిదీ పంచభూతాల్లో కలవాలని, అహంకారం వీడాలని చెప్పే తత్వం అది. అందుకే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కాకుండా మట్టి విగ్రహాలకే ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పడం బాగుంటుంది. గణనాథుడిని మండపంలో ప్రతిష్టించడం ఆచారం అయితే, ఆయన బోధించే ఐక్యత, జ్ఞానం, బాధ్యతను మన మనసుల్లో ప్రతిష్టించడమే నిజమైన గణేష్ ఉత్సవం.

కాంగ్రెస్ వెయ్యి రోజుల మహాసభకు తరలిన నాయకులు

అక్షరటుడే, మెండోరా: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పురస్కరించుకుని నిర్వహించనున్న మహాసభకు పోచంపాడ్ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ పిలుపు మేరకు, మోర్తాడ్‌లో మంత్రి సీతక్క పాల్గొన్న కార్యక్రమానికి కార్యకర్తలు వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ కిరణ్, రమేష్, సంతోష్, చందు, అజ్జు, నరేందర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని కిసాన్ నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి పుణ్యరాజు 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో మోతిబిందు ఉన్న వారిని గుర్తించి, శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ రీజినల్ ఛైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డి, కార్యదర్శి చాకు లింగం, యాదగిరి గౌడ్, కనకయ్య గౌడ్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే

అక్షరటుడే, కోటగిరి : మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డిస్ట్రిక్ట్ 320డీ ఆధ్వర్యంలో మంగళవారం ఇంజినీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో భారత రత్నమోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మండల పరిధిలోని పలు విభాగాల్లో ఇంజినీర్లుగా సేవలు అందిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనరాజ్, పీఆర్ ఏఈ నవదీప్ గౌడ్, ఇరిగేషన్ ఏఈ రవి కుమార్, విద్యుత్ ఏఈ బుజ్జిబాబు, అసిస్టెంట్ ఏఈ సీహెచ్ సుమిద, ఇంజినీర్లకు క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పత్తి లక్ష్మణ్ మాట్లాడుతూ.. గ్రామాలభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ఎంపీడీవో విష్ణు, హనుమంత్ రావు, అశ్విన్ సేట్, నిశాంత్ సేట్, అనిల్, సిద్దు, ఉదయ భాస్కర్, శ్యాం పాల్గొన్నారు.

కామారెడ్డిలో దారుణం.. మహిళపై బ్లేడ్‌తో దాడి

అక్షరటుడే, కామారెడ్డి : పట్టణంలో పట్టపగలు దోపిడీ ఘటన కలకలం రేపింది. స్థానిక విద్యానగర్ కాలనీలో ఇంట్లో ఉన్న ఓ మహిళపై ఆగంతకుడు బ్లేడ్‌తో దాడికి తెగబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ కాలనీకి చెందిన జొన్నాల సునీత ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడ్డాడు. బ్లేడుతో ఆమె పెదవి పై గాయపరిచి, చంపుతానని బెదిరించి మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కుని పారిపోయాడు. దోచుకెళ్లిన పుస్తెలతాడులో రెండు పోగులు, మూడు బంగారు పూసలు, రెండు పుస్తెలు ఉన్నాయని, దాని విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై కామారెడ్డి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

ఆటల్లో గెలిచారు.. ఊరి పేరు నిలిపారు!

అక్షరటుడే, భీమ్‌గల్ : మండల స్థాయి క్రీడా పోటీల్లో బడా భీమ్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ క్రీడా పటిమతో ప్రతిభ చూపారు. కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, ఖోఖో తదితర పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకుని పాఠశాలతో పాటు గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారు. విజేతలుగా నిలిచిన 65 మంది విద్యార్థులను మంగళవారం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు విద్యార్థులకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధారుఢ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో వార్డు సభ్యులు మాంద్ర సుమన్, దాస్ అరుణ్, నవీన్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, మేఘన, మానస, గీత, లత, సత్తెవ్వలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణస్వామి, వ్యాయామ ఉపాధ్యాయుడు భూపతి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో ఇంజినీర్ల పాత్ర కీలకం

అక్షరటుడే, కామారెడ్డి: మౌలిక వసతుల కల్పనలో ఇంజినీర్ల పాత్ర కీలకమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జాతీయ ఇంజినీర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఛైర్‌పర్సన్ ఉమారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి, ఇంజినీరింగ్ రంగానికి విశ్వేశ్వరయ్య అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంతారావు, ఏఈ వేణు ప్రసాద్, టీపీవో దేవరాజు, టీపీఎస్ కావ్య, టీపీబీవో సాయి కిరణ్, మల్లికార్జున్, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ముదేల్లి సర్పంచ్ లక్ష్మణ్..

అక్షరటుడే, గాంధారి: మండలంలోని ముదేల్లి సర్పంచ్ లక్ష్మణ్ ఎమ్మెల్యే మదన్మోహన్ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే సర్పంచ్ లక్ష్మణ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.

గణపతుల బావి వద్ద పారిశుధ్య కార్యక్రమం

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నగరంలోని 45వ డివిజన్ పరిధిలోని గణపతుల బావిని మంగళవారం బీజేపీ కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ ఆధ్వర్యంలో శుభ్రపర్చారు. ఈ సందర్భంగా బావిలోని మట్టిని పూర్తిగా తొలగింపజేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బావిని శుభ్రపరిచినట్లు పేర్కొన్నారు

డొంకేశ్వర్‌లో కర్ర గణపతికి భక్తితో పూజలు

అక్షరటుడే,డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పూర్తిగా కర్రతో తయారు చేసిన గణపతి విగ్రహాన్ని తొమ్మిదేళ్లుగా ప్రతిష్ఠిస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ గణపతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ విగ్రహం పదకొండు రోజులు ప్రత్యేక పూజలు అందుకుంటుంది. అలాగే ఈ మండపం వద్ద ప్రతిరోజు భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. పదకొండు రోజులు ప్రత్యేక పూజలు అందుకున్న అనంతరం గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు జరిపి గోదావరి నీటితో అభిషేకం చేస్తారు. అనంతరం విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన బీరువాలో భద్రపరుస్తామని నిర్వాహకులు తెలిపారు.. ప్రతి ఏడాది ప్రతిష్ఠాపన కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొంటారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: దేశం గర్వించదగ్గ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ పీవీ రాజేశ్వర్‌రావు సూచించారు. ఇంజినీర్స్ డేను నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లో ఘనంగా నిర్వహించారు. గౌరవ అతిథి పంచాయతీరాజ్ ఎస్ఈ రాథోడ్ శంకర్ మాట్లాడుతూ ఈ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది ఉన్నతస్థానాల్లో ఉన్నారు. తాను కూడా ఇదే కళాశాలలో చదువుకున్నానన్నారు. పాలిటెక్నిక్ బ్రాంచ్ టాపర్లు అయినా ఆరుగురు విద్యార్థులను సన్మానించారు. వారికి బిగాల కృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేల చెక్కు అందజేశారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రాజన్న, పూర్వ విద్యార్థుల సంఘం సహా అధ్యక్షుడు కేఎల్వీ రమణ, ప్రధాన కార్యదర్శి తోట రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మోహన్ కుమార్, సంయుక్త కార్యదర్శి పొలాస సత్యనారాయణ, వినోద్ కుమార్, బాబా శ్రీనివాస్, కృష్ణమూర్తి, నరేష్ కుమార్, హరికృష్ణ, వీరేశం, గంగాధర్, రషీద్ భాయ్, సయ్యద్, రచ్చ నర్సయ్య, భూమయ్య, విశ్రాంత ప్రిన్సిపల్ నాగయ్య, ప్రకాష్ రావు, నాయుడు సుబ్బారావు పాల్గొన్నారు.